నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, మంగళవారం 18 జూన్ 2024 | YADADRI BHUVANAGIRI

మోటకొండూర్‌లో బొడ్రాయి వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సునీతామహేందర్‌రెడ్డి, కిశోర్, భిక్షమయ్యగౌడ్

ప్రజలంతా దైవ భక్తితో మెలగాలి

- గ్రామ దేవతల పండుగలతో పల్లెలు సుభిక్షం
- బొడ్రాయి వేడుకల్లో మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి

వేడుకల్లో పాల్గొన్న హరీశ్‌రావుకు జ్ఞాపిక అందజేస్తున్న మాజీ సర్పంచ్ వడ్డెబోయిన శ్రీలతాశ్రీనివాస్

మోటకొండూర్, జూన్ 17 : ప్రజలంతా దైవభక్తితో మెలగాలని మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, గుంట కండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. మోటకొండూర్ మండల కేంద్రంలో సోమవారం మాజీ సర్పంచ్ వడ్డెబోయిన శ్రీలతాశ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవంలో వారు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ దేవతల పండుగలతోనే గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని, ప్రజలు సంతోషంగా వేడుకలు జరుపుకోవాలని అన్నారు. అనంతరం మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలను నిర్వాహకులు శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, పైళ్ల శేఖర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, బూడిద బిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సుదగాని హరిశంకర్ గౌడ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్, జడ్పీటీసీ పల్లా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజ మనుగడకు సాహిత్యం మార్గదర్శనం

- తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిధారెడ్డి
- మోత్కూరులో మమతల పందిరి పుస్తకావిష్కరణ

మమతల పందిరి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిధారెడ్డి, చిత్రంలో రచయిత మర్రి జయశ్రీ, ప్రముఖులు

మోత్కూరు, జూన్ 16 : సమాజ మనుగడకు ప్రాచీనా సాహిత్యం మార్గదర్శనమని తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు. మోత్కూరు ప్రజా భారతి సాహిత్య సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ పూర్వ ప్రధాన కార్యదర్శి, కవి, తెలుగు ఉపాధ్యాయురాలు మర్రి జయశ్రీ రచించిన 'మమతల పందిరి' పుస్తకాన్ని సోమవారం మోత్కూరులోని ఓ ఫంక్షన్‌లో సినీ గేయ రచయిత అభినయ శ్రీనివాస్‌తో ఆయన కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిధారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ యాస, భాష భవిష్యత్‌లో అంతరించి పోయే ప్రమాదముందని, తెలుగు భాషను ముందు తరాల వారికి అందించేందుకు మంచి సంస్కృతితో నడువాలని అన్నారు. కవులతో సమాజానికి మేలు జరుగుతుందని, సాహితీ పరులు, ఉద్యమకారులకు ఈ ప్రాంతం నిలయమైందని తెలిపారు. మోత్కూరు ప్రజాభారతి ప్రోత్సాహంతో తనకు పేగు బంధం సాహిత్య బంధమైందని చెప్పారు. ప్రముఖ గేయ రచయిత అభినయ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం నుంచి మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు అనేక ఉద్యమాల్లో మోత్కూరు ముందు నిలిచిందన్నారు. అనంతరం మమతల పందిరిని అందించిన మర్రి జయశ్రీని అభినందించారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పోరెడ్డి రంగయ్య గ్రంథ సమీక్ష చేశారు. సంస్థ అధ్యక్షుడు దేవినేని అరవిందరాయుడు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ డిప్యూటీ కలెక్టర్ దామల రాంప్రసాద్, కులీకుతుబ్ షా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మీసాల సైదులు, రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండారు జయశ్రీ, మోత్కూరు విశ్రాంత తాలుకా సంఘం పూర్వ అధ్యక్షుడు మర్రి ఆనందం, కేరళ నాభి అకాడమీ అసిస్టెంట్ ప్రొఫెసర్ గోలి రామకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ బండ్ల రవికుమార్, మర్రి అనిల్‌కుమార్, మేక శివకుమార్, ఎస్ఎన్‌చారి, జి.వెంకన్న, రాంప్రసాద్, విజయలక్ష్మి, కూరెళ్ల శ్రీనివాస్, సుజాత, లక్ష్మీనర్సింహారెడ్డి, మహేందర్, గాదె వెంకన్న, రాజు పాల్గొన్నారు.

ఏప్రిల్ నుంచే ఎంసీహెచ్ కిట్ల పెండింగ్..

- వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్

యాదాద్రి భువనగిరి, జూన్ 17 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఏప్రిల్ 25వ తేదీ వరకు బాలింతలకు ఎంసీహెచ్ కిట్ అందించామని వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, ఎన్‌హెచ్ఎం మిషన్ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. ఈ నెల 15న నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన ''కిట్ కట్'' అనే కథనానికి ఆయన స్పందించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో మొత్తం 27,222 మందికి డెలివరీలు జరిగాయని, ఇందులో తొలుత ఇద్దరు పిల్లలున్న 23,503 మందికి ఎంసీహెచ్ కిట్లు అందినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఆర్థిక సాయానికి సంబంధించి ఇప్పటికే రూ. 36.34 కోట్లు లబ్ధిదారులకు అందించామని, ఇంకా రూ. 11.84 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని స్పష్టం చేశారు. కిట్‌లో భాగంగా జాన్సన్ అండ్ జాన్సన్ పౌడర్ సరఫరా 2022 సెప్టెంబర్ నుంచి నిలిపివేసినట్లు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

ఈద్‌గాహ్, మసీదుల్లో సామూహిక ప్రార్థనలు

శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆలేరు ఈద్‌గాహ్‌లో ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

భువనగిరిలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి అర్బన్ / ఆలేరు రూరల్, జూన్ 17 : త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్‌ను సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈద్‌గాహ్‌లు, మసీదుల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. వివిధ ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మత గురువులు బక్రీద్ ప్రత్యేకతను, ఖురాన్‌లోని విషయాలను వివరించారు.

భువనగిరి ఈద్‌గాహ్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నల్లగొండ ఎస్పీగా శరత్ చంద్ర పవార్

- రైల్వే ఎస్పీగా చందనా దీప్తి బదిలీ

నల్లగొండ ప్రతినిధి, జూన్ 17(నమస్తే తెలంగాణ) : మూడు రోజుల వ్యవధిలో నల్లగొండ జిల్లా పాలన రథ సారథులిద్దరూ బదిలీ కావడం చర్చనీయంశంగా మారింది. వీరిద్దరూ జిల్లాకు ఈ ఏడాది తొలి వారంలోనే రావడం.. వచ్చిన ఆరు నెల్లలోపే బదిలీ కావడం విశేషం. ఈ నెల 15న కలెక్టర్ హరిచందన బదిలీ కాగా తాజాగా సోమవారం జిల్లా ఎస్పీ చందనా దీప్తికి కూడా స్థాన చలనం తప్పలేదు. చందనాదీప్తి స్థానంలో స్టేట్ నార్కోటిక్స్ విభాగం ఎస్పీగా పనిచేస్తున్న 2016 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ శరత్ చంద్ర పవార్‌ను జిల్లా ఎస్పీగా పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా చందనా దీప్తికి రైల్వేస్ ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. వాస్తవంగా అసెంబ్లీ ఎన్నికల తరువాత అప్పటివరకు ఉన్న జిల్లా పాలన యంత్రాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ చివరి వారంలో మార్చింది. ఈ ఏడాది జనవరి 1న అపూర్వరావు స్థానంలో ఎస్పీగా చందనా దీప్తి బాధ్యతలు చేపట్టారు. సరిగ్గా 5 నెలల 17 రోజులకే బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇటీవల కాలంలో ఇంత తక్కువ వ్యవధిలో బదిలీ అయినా ఎస్పీ చందనా దీప్తినే అవడం గమనార్హం. ఇదిలా ఉంటే మూడు రోజుల వ్యవధిలో జరిగిన ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీల్లో సీఎం రేవంత్ రెడ్డి మార్క్ కనిపిస్తున్నట్లు చర్చ జరుగుతున్నది. జిల్లాల మంత్రులు, ఇతర ముఖ్యులతో సంబంధం లేకుండానే పూర్తిగా రేవంత్ రెడ్డి కనుసన్నుల్లోనే జిల్లాల కలెక్టర్లు, ఎస్పీల బదిలీలు జరిగినట్లు సమాచారం.

నల్లగొండ కొత్త ఎస్పీ శరత్ చంద్ర పవార్

సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేట ఎస్పీగా సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేట సిటీ : సూర్యాపేట నూతన ఎస్పీగా సన్‌ప్రీత్ సింగ్ నియామకం అయ్యారు. ప్రస్తుతం జగిత్యాల ఎస్పీగా పనిచేస్తున్న 2011 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సన్‌ప్రీత్ సింగ్ ఇక్కడకు బదిలీపై రానున్నారు. కాగా సూర్యాపేట ఎస్పీగా పనిచేస్తున్న రాహుల్ హెగ్డే హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా బదిలీ అయ్యారు.

తీరొక్క మొక్కలతో హరితహారం

జిల్లాలో మొక్కలు నాటేందుకు సన్నద్ధం

- ప్లాంటేషన్‌కు అధికారుల ప్రణాళిక
- 18లక్షల మొక్కలు నాటేలా లక్ష్యం
- ఇప్పటికే ఉపాధి హామీ కింద గుంతలు తీసే కార్యక్రమం
- మొక్కలతో చిట్టడవిని తలపిస్తున్న నర్సరీలు
- వచ్చే నెల నుంచి ప్లాంటేషన్ ప్రారంభం
- హరితహారం పేరు మార్చే యోచనలో సర్కారు..!

భువనగిరి మండలం హనుమాపురం నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

యాదాద్రి భువనగిరి, జూన్ 17 (నమస్తే తెలంగాణ) : హరితహారం కార్యక్రమానికి రంగం సిద్ధమవుతున్నది. మొక్కలు నాటేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే నర్సరీల్లో తీరొక్క మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. జిల్లాలో 30లక్షల మొక్కలు రెడీగా ఉండగా, 18లక్షల మొక్కలు నాటేందుకు వివిధ విభాగాలకు లక్ష్యం నిర్దేశించారు. వచ్చే నెల నుంచి పెద్ద ఎత్తున హరితహారం మొక్కలు నాటనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

అందుబాటులో 30లక్షల మొక్కలు

బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అడవులను పెంచడంలో భాగంగా హరితహారం కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. ఏటా లక్షల మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించారు. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా జిల్లాలో మొక్కలు నాటేందుకు ప్లాన్ చేస్తున్నారు. జిల్లాలో మూడు గ్రామ పంచాయతీలు మినహా 418జీపీల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామ పంచాయతీల్లో మొక్కలను జోరుగా పెంచారు. వాటి ఎదుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే జిల్లాలో హరితహారం కోసం మొక్కలు సిద్ధం చేశారు. ప్రస్తుతం జిల్లాలో 30లక్షల వరకు మొక్కలు అందుబాటులో ఉన్నాయి.

తీరొక్క మొక్కలు..

ఆయా నర్సరీల్లో అధికారులు రకరకాల మొక్కలు పెంచారు. పండ్లు, పూలు, నీడనిచ్చే సుమారు 30రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. జామ, అల్లనేరేడు, చక్రమల్లె, మందారం, నేరేడు, మల్లె, చామంతి, వాటర్ ఆపిల్, గన్నేరు, మైదాకు, గులాబీ, గుల్‌మోహర్, పెల్టో ఫోరం, దానిమ్మ, కానుగ, పారిజాతం, టెకోమా, శ్రీగంధం, నెమలినార, వేప, కదంబ, నిద్ర గన్నేరు, బాదాం, బోహమియా, స్పతోడియా, చింత, సీతాఫలం, నరేఫా, సిల్వియా తదితర మొక్కలను పెంచారు. రకరకాల మొక్కలతో నర్సరీలు పచ్చదనం పరుచుకొని చిట్టడవిని తలపిస్తున్నాయి.

తగ్గిన టార్గెట్

జిల్లాలో ఈ సారి మొక్కలు నాటే టార్గెట్ సంఖ్య తగ్గింది. గతేడాది 21.61లక్షల మొక్కలు లక్ష్యం కాగా, ఈ సారి 18 లక్షలకు తగ్గించారు. అంటే సుమారు 3.61లక్షల మొక్కలు టార్గెట్ తగ్గింది. ఇందులో గ్రామీణాభివృద్ధి శాఖకు 9లక్షలు, అటవీ శాఖకు లక్ష, వ్యవసాయ శాఖకు 50వేలు, పంచాయతీ రాజ్‌కు 2లక్షలు, నీటి పారుదలకు 75వేలు, ఆర్‌అండ్‌బీకి 25వేలు, పంచాయతీ రాజ్ రోడ్లకు 45వేలు, ఆబ్కారీకి 40వేలు, ఇండస్ట్రీస్‌కు 25వేలు, భువనగిరి మున్సిపాలిటీకి 1.61లక్షలు, ఆలేరుకు 35వేలు, యాదగిరిగుట్టకు 25వేలు, చౌటుప్పల్‌కు 45వేలు, మోత్కూరుకు 28,900, పోచంపల్లి మున్సిపాలిటీకి 22వేల చొప్పున లక్ష్యం నిర్దేశించారు.

జూలై మొదటి వారంలో..

జిల్లాలో వచ్చే నెల నుంచి మొక్కలు నాటడం ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. జూలై మొదటి వారంలో మొక్కలు నాటనున్నారు. ఇందులో వివిధ విభాగాలతోపాటు ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయనున్నారు. ఇప్పటికే జిల్లాలో ఉపాధి హామీ కింద 2,74,000 గుంతలు తీశారు. కాగా హరితహారం కార్యక్రమం పేరును కూడా మార్చే సూచనలు కనిపిస్తున్నాయి. హరితహారం స్థానంలో వన మహోత్సవం అనే పేరు పెట్టాలనే ప్రతిపాదనలు ఉన్నట్లు తెలుస్తున్నది. హరితహారం కేసీఆర్ ప్రారంభించిన కార్యక్రమం కావడంతో దాన్ని మార్చే ఆలోచనలో సర్కారు ఉన్నట్లు సమాచారం.

100 రోజులు.. 46 లక్షల మంది భక్తులు

- స్వర్ణగిరికి దేశ, విదేశాల నుంచి భక్తజనం
- ఊహించిన దానికంటే 10రెట్లు అధికంగా రాక
- భక్తులకు ఇబ్బందులు లేకుండా సదుపాయాలు మెరుగు
- ట్రస్ట్‌ల ద్వారా రూ.12.49కోట్ల ఆదాయం
- 8వేల మందికి నిత్యాన్నదానం
- ఆన్‌లైన్‌లో అన్ని ఆర్జిత సేవలు ప్రారంభం
- వచ్చే నెలలో అందుబాటులోకి కాటేజీలు
- స్వర్ణగిరి ఆలయ ధర్మకర్త మానేపల్లి రామారావు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త మానేపల్లి రామారావు

యాదాద్రి భువనగిరి, జూన్ 17 (నమస్తే తెలంగాణ) : స్వర్ణగిరీశుడి దర్శనం ప్రారంభమై వంద రోజులు పూర్తయ్యిందని, క్షేత్రానికి ఇప్పటి వరకు 46లక్షల మంది భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారని స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త మానేపల్లి రామారావు తెలిపారు. ఆలయ ప్రతిష్ట చేసి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఆలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర నలుమూల నుంచే గాక దేశ, విదేశాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారని వివరించారు. ఇప్పటివరకు వివిధ ట్రస్ట్‌ల ద్వారా రూ.12.49కోట్ల ఆదాయం సమకూరిందని వెల్లడించారు. ఆలయానికి వచ్చే ప్రతి పైసా భక్తుల కోసమే ఖర్చు చేస్తామని, ఒక్క పైసా దుర్వినియోగం చేయబోమని తెలిపారు. దేశంలోనే ఆధునిక ఆర్కిటెక్చర్‌లో అయోధ్య రామమందిరం తర్వాత స్వర్ణగిరి రెండో స్థానంలో నిలిచిందన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా వచ్చే నెలలో కాటేజీలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. భక్తుల భద్రత కోసం పోలీసులతో సమన్వయం చేసుకుంటున్నామని, సీసీ కెమెరాలు, స్కానర్లు ఏర్పాటు చేస్తామన్నారు.

ఆన్‌లైన్‌లో అన్ని ఆర్జిత సేవలు..

స్వర్ణగిరీశుడికి ఆర్జిత సేవలు ఇకపై పూర్తిస్థాయిలో భక్తులకు అందుబాటులో ఉండనున్నట్లు రామారావు తెలిపారు. షోడశోపచార సేవల్లో భాగంగా ఉదయం 5గంటల ప్రారంభమయ్యే సుప్రభాత సేవ మొదలుకొని ఏకాంత సేవ వరకు 16 ఆర్జిత సేవలను www.ytdtemple.com వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవచ్చన్నారు. సేవల బుకింగ్ కోసం భక్తులు క్యూలైన్లలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చన్నారు. మధ్యాహ్నం 1.30గంటల నుంచి 2.30గంటల వరకు మాత్రమే విరామం ఉంటుందని.. శని, ఆదివారాల్లో ఉదయం 8గంటల నుంచి రాత్రి 9గంటల వరకు నిరంతరాయంగా స్వామివారిని దర్శించుకోవచ్చన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు..

స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మానేపల్లి రామారావు తెలిపారు. తాము ఊహించిన దానికంటే పదిరెట్లు అధికంగా భక్తులు వస్తున్నారని, రోజురోజుకు సదుపాయాలు మెరుగుపరుస్తున్నామని పేర్కొన్నారు. వృద్ధులకు వీల్‌చైర్ ద్వారా స్వామివారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

మొదట్లో 35 మంది సిబ్బంది ఉండగా, ఇప్పుడు 450 మంది ఉద్యోగులు పని చేస్తున్నారని వివరించారు. భక్తుల కోసం నిత్యాన్నదాన కార్యక్రమం కొనసాగిస్తున్నామని, ప్రారంభంలో రెండు వేల మందికి మాత్రమే పరిమితం కాగా.. ఇప్పుడు రోజుకు 8 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరిస్తున్నారని పేర్కొన్నారు. విరాళాలు అన్నింటికీ సెక్షన్ 80జీ ద్వారా ఆదాయ పన్ను మినహాయింపు ఉందన్నారు. భక్తుల కోసం స్వామివారికి ప్రీతిపాత్రమైన గోశాలను కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఉప్పల్ నుంచి క్షేత్రానికి బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. శాశ్వత వీధి దీపాలు, రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో ఆలయ ధర్మకర్తలు మురళీకృష్ణ, గోపీకృష్ణ, అర్చకులు శ్రవణాచార్య, స్థపతి డీఎన్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.